క్లుప్తంగా

నేడు ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లో వేంచేసి యున్న శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో మంగళవారం సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని ఆలయంలో సాయంత్రం 4.30 గంటలకు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నారు. 6.30 గంటలకు శక్తి గణపతికి పంచామృతాభిషేకాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విఘ్నేశ్వరుడి పూజాది కార్యక్రమాల్లో పాల్గొని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.

నాగలింగేశ్వర ఆలయంలో రుద్రాభిషేకం



ఆల్విన్‌కాలనీ: దత్తాత్రేయ కాలనీలోని శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, శ్రీనివాస్, యాదగిరి, దేవేందర్, రామకృష్ణ, నాగార్జున, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో శరణప్ప, వాజీద్, పార్వతి, వెంకటేశ్వర్ రావు, పింకిలకు రూ.2 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా



డ్రైనేజీని పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్ అధికారులు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: భారీ వర్షాలకు హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌కాలనీ డ్రైనేజీ పొంగడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు వాటర్‌వర్క్స్ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రియాంక, డ్రైనేజీ సూపర్‌వైజర్ నరేంద్ర, డివిజన్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



వేడుకల్లో బంజారా నాయకులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని సేవాలాల్‌నగర్‌లో సోమవారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొలకలను నెత్తిన పెట్టుకుని ర్యాలీగా, బంజారా సంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తూ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో స్థానికులు కైలా, శంకర్, తుకారం, లక్‌పతి, లచ్చిరాం, పాషా, రాందాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మలయాళీల అభివృద్ధికి కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి : మలయాళీల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ అన్నారు. వల్లభ్‌నగర్‌లో ఓల్డ్ బోయిన్‌పల్లి మలయాళీల అసోసియేషన్ భవనంపై నిర్మించిన మొదటి అంతస్తును సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మెన్ అప్పుకుట్టన్ నాయర్, కార్యదర్శి బాబు, కోశాధికారి వేణుస్వామి జాయింట్ సెక్రటరి పద్మనాభన్, కనకదాస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 20 ఫిర్యాదులు వచ్చినట్లు కమిషనర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ 9, టౌన్‌ప్లానింగ్ 8, అడ్మినిస్ట్రేషన్ 1, హెల్త్ అండ్ శానిటేషన్ 1, యూబీడీకి సంబంధించి 1 ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ..

మోతీనగర్: మోతీనగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ బీ బ్లాక్ మాజీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబీర్‌నగర్‌లో నాలా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గణేశ్ నవరాత్రులను దృష్టిలో పెట్టుకుని రోడ్లకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా రోడ్లపై గుంతలు పూడ్చాలని కోరారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని, 10 రోజుల్లో నాలా పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కేపీఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, నాయకుల సోమ సచిన్, ఆనంద్ రెడ్డి, బాబి ముదిరాజ్, మహేశ్ యాదవ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్‌కాలనీలో..

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీ అనుబంధ కాలనీలు, బస్తీల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగిరెడ్డి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ ప్రధాన రహదారికి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అంతర్గత రోడ్లు, పార్కుల సుందరీకరణ, వాకింగ్ గ్రౌండ్ జిమ్‌లో మరిన్ని పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వెంకటేష్‌యాదవ్, భిక్షపతి గౌడ్, బాబు, లక్ష్మణ్, మూర్తి పాల్గొన్నారు.

భరత్‌నగర్ మార్కెట్ ప్రాంతంలో..

ఆల్విన్‌కాలనీ: ఫతేనగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భరత్‌నగర్ మార్కెట్ ప్రాంతంలో బహిరంగ మూత్ర విసర్జన, పారిశుధ్య సమస్యలు, రోడ్డుపైనే కూరగాయల లోడింగ్, అన్‌లోడింగ్‌తో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, పాఠశాలలు, కార్యాలయానికి వెళ్లే వారు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నా మల,మూత్ర విసర్జన చేస్తున్నారని వెంటనే పరిష్కరించాలని కోరారు. స్పందించిన జెడ్‌సీ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు బూరుగుపల్లి రామ్మోహన్, గండ్లోళ్ల సతీశ్ గౌడ్, భవాని, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

వాకింగ్‌లో బంగారు పతకం



మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: జింఖానా గ్రౌండ్‌లో మాస్టర్ అథ్లెటిక్‌లో భాగంగా నిర్వహించిన 3 కిలోమీటర్ల వాకింగ్‌లో సాయినగర్‌కు చెందిన గుర్రం మహేందర్‌రెడ్డి బంగారు పతకం సాధించాడు. దీంతో బోయిన్‌పల్లి కృష్ణస్వామి మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆయనను సన్మానించారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ హాజరై మాట్లాడుతూ.. 69 ఏళ్ల వయస్సులో పతకం సాధించడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో వాకర్స్ కిరణ్ కుమార్‌గౌడ్, సిద్ది రామిరెడ్డి, లింగన్న, రాంరెడ్డి, ప్రమోద్‌కుమార్, చందులాల్, దీపారెడ్డి, శివాజీ, బాలకృష్ణ, శ్రీకాంత్‌యాదవ్, చికోటి శ్రీనివాస్, శేఖర్, విజయకుమార్, సీఐడీ ఇన్‌స్పెక్టర్ నీతారెడ్డి, మహేశ్‌కుమార్ శాస్త్రి, బీఆర్‌ఎస్ నాయకులు కర్రె జంగయ్య, బుర్రి యాదగిరి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



సనత్‌నగర్: నాగరాజరాజేశ్వరీనగర్‌లో కొలువుదీరిన నాగరాజరాజేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, రాజు, నరసింహ, రాము, రాజు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థి సంఘాల నాయకుల నిరసన



కళ్లకు గంతలతో నిరసనలో నాయకులు

బాలానగర్: జేఎన్‌టీయూలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఎన్‌టీయూ విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2 యూనివర్సిటీల మధ్య జరిగిన ఎంఓయూలపై అనేక వార్తలు వస్తున్నాయని జేఎన్‌టీయూ అధికారులు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు వస్తున్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఒప్పందంలో నిజాలు నిర్ధారించేందుకు జేఎన్‌టీయూహెచ్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు కరుణాకర్‌రెడ్డి, దిలీప్, అశోక్ గౌడ్, తేజ, భానుప్రకాశ్, జగన్, రాహుల్, సాగర్, జయరాం, విశాల్, ఆదిత్య, ధనుంజయ్, ఆనంద్, ఋత్విక, శ్రీకాంత్, విశాల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేసిన కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌కు చెందిన ఉప్పలపు వెంకట నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సోమవారం మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్, సంగమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వలస కూలీ ఆత్మహత్య

గచ్చిబౌలి: మానసిక రుగ్మతతో బాధపడుతూ ఓ వలస కూలీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్, దేవిరికాపకు చెందిన రాంప్రసాద్(28) ఈ నెల 6న గచ్చిబౌలికి వచ్చాడు. సంధ్య కన్వెన్షన్ గోడౌన్‌లో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. వరుసకు సోదరుడైన రమేష్ మేరాబి ఆదివారం సాయంత్రం 5 గంటలకు లింగంపల్లి కూరగాయల మార్కెట్‌కు వెళ్లగా రాంప్రసాద్ గోడౌన్‌లోనే ఉన్నాడు. ఈ క్రమంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉండటాన్ని గమనించి అతను పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి వినాయక విగ్రహాల తయారి



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. అనుభవజ్ఞులైన కళాకారులు వారికి విగ్రహ తయారీలో సహకరించారు. నిమజ్జనంలో పర్యావరణానికి ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా సహజమైన రంగులతో ఏకో ఫ్రెండ్లీ వినాయకులను తయారు చేశారు. సార్జెంట్ ఖ్యాతి నన్నపనేని ఎన్‌సీసీ కెడెట్ల శిక్షణలో భాగంగా ఈ వర్క్‌షాపును నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్ : మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ నిధులు రూ.20 లక్షలతో బాచుపల్లి పరిధిలోని శ్రీ హోమ్స్ కాలనీ 1ఏ, 2బీలో సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీవాసులు హన్మంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణరెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కొలన్ జీవన్‌రెడ్డి, గోంగుల జిత్తు, ప్రవీణ్‌గౌడ్, రాజేందర్, విజయ పాల్గొన్నారు.

ఇంట్లో గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తి అరెస్టు



నిజాంపేట్: రాజీవ్‌గాంధీనగర్‌లోని ఓ వ్యక్తి తన నివాసంలో అక్రమంగా గంజాయి మొక్కను పెంచుతున్నట్లు బాచుపల్లి పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా సుమారు 6 అడుగుల ఎత్తులో ఉన్న గంజాయి మొక్కను గుర్తించారు. ప్రెస్టన్ ఫెసిలిటీ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్‌లో మోంచజ్యోతి బోనియా (43) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతను ఏడాదిగా బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో కాలనీలో నివసిస్తున్నట్లు తెలిసింది. మూడేళ్లుగా మోంచజ్యోతి బోనియాకు గంజాయి సేవించే అలవాటు ఉందని, సుమారు 6 నెలల క్రితం వ్యక్తిగత వినియోగం కోసం తన ఇంటిముందు ఈ మొక్కను నాటినట్లు తెలిసింది. సోమవారం బాచుపల్లి పోలీసులు మోంచజ్యోతి బోనియాను అదుపులోకి తీసుకుని, గంజాయి మొక్కను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్, వైద్యులు

ఆల్విన్‌కాలనీ: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో 1–19 ఏళ్ల వయస్సు గల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, వైద్యులు మాట్లాడుతూ.. పిల్లలు అపరిశుభ్ర ప్రదేశాల్లో ఆటలు ఆడడం, మల విసర్జన ద్వారా నులి పురుగులు వ్యాపిస్తాయన్నారు. భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్, గుడ్ల శ్రీనివాస్, డాక్టర్లు డి. మౌనిక, సుజీలీల, కృష్ణవేణి, సంతోషి, రాజ్యలక్ష్మి, శశిరేఖ, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నాలా పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రామారావునగర్ నాలా పనులను మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, రాజు చారి, సంజీవ, నూర్‌ఖాన్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



పనులు త్వరగా పూర్తి చేయాలి



ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ అధికారులకు సూచించారు. సిండికేట్ బ్యాంక్‌కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ను సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశా, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, నాయకులు మైపాల్‌రెడ్డి, కర్రె జంగయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో అధ్యక్షుడు రాజుచారి తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి. రామారావునగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గెలుపొందిన ఎస్. రాజుచారి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ను అభినందించి మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని అనంతరం సమష్టిగా కాలనీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, సత్యం గంగపుత్ర, బీ వెంకట్ యాదవ్, ఆవుల సంజీవరావు పటేల్, శివ, యశ్వంత్, ముక్తార్, నజీర్, సత్యనారాయణ, రాము, కృష్ణ, శివయ్య పాల్గొన్నారు.

వ్యాపారి హత్య కేసులో నలుగురి నిందితుల అరెస్ట్

మియాపూర్ : తన వ్యాపారం సరిగా జరగడం లేదనే అక్కసుతో పక్క వ్యాపారి గొంతుకోసి హత్య చేసిన ఘటనలో నలుగురు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. మాదాపూర్ డీసీపీ వినీత్, మియాపూర్ సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ హఫీజ్‌పేట్‌కు చెందిన ఎస్‌కే. మొహీజ్40) హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ సమీపంలో మంజీరా రోడ్డు పక్కన కట్టెల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతని దుకాణానికి కొంతదూరంలో వనపర్తి జిల్లా పెద్దమందారి మండలం జంగమయ్యపల్లికి చెందిన బుల్లెద్దుల శ్రీనివాస్(40) కట్టెల వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా శ్రీనివాస్ వ్యాపారం బాగా జరుగుతుండడంతో మొహీజ్ కక్ష పెంచుకుని శ్రీనివాస్‌తో పలుమార్లు గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం 11 గంటల సమయంలో మొహీజ్ తన అల్లుడు సాహిల్(17)తో కలిసి శ్రీనివాస్‌తో గొడవపడ్డారు. తర్వాత శ్రీనివాస్ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో మొహీజ్ కట్టెల దుకాణం ముందునుండి ఇంటికి వెళ్తుండగా మొహీజ్ వెనుక నుండి వెళ్లి శ్రీనివాస్ మెడను గట్టిగా పట్టుకున్నాడు. మొహీజ్ దుకాణంలో పనిచేస్తున్న మక్బుల్(40), అన్వర్ కూడా శ్రీనివాస్‌ను గట్టిగా పట్టుకున్నారు. సాహిల్ కత్తితో శ్రీనివాస్ కడుపులో పొడవడంతో పాటు గొంతుకోశాడు. తీవ్ర రక్తస్రావంతో శ్రీనివాస్ పడిపోయాడు. అక్కడి నుండి నలుగురు పరారయ్యారు. స్థానికులు చూసి దగ్గర్లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరిశీలించి శ్రీనివాస్ మృతి చెందాడని తెలిపారు. పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. కాగా సోమవారం సాహిల్, మొహీజ్, మక్బుల్, అన్వర్‌లను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసింది తామేనని అంగీకరించారు. దీంతో మైనర్ అయినా సాహిల్‌ను జువైనల్ హోమ్‌కు తరలించగా మొహీజ్, మక్బుల్, అన్వర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. శ్రీనివాస్ భార్య సోనిలా, ఇద్దరు పిల్లలు స్వంత గ్రామంలో ఉంటుండగా శ్రీనివాస్ రాధ అనే మహిళను మరో వివాహం చేసుకుని హఫీజ్‌పేటలో ఉంటున్నాడు.

చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- అంకిరెడ్డిపల్లి బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్,కాలేజీ ఆకస్మిక తనిఖీ



జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కీసర: విద్యార్థులు విద్యార్థి దశ నుండే లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేలా కష్టపడి చదువుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సోమవారం కీసర మండలం అంకిరెడ్డిపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితం, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులపై బోధించి, స్టాక్ మార్కెట్, బ్యాంకింగ్, షేర్స్, టెక్నాలజీ అనాలసిస్, ఫండమెంటల్ అనాలసిస్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సివిల్స్‌పై ఆసక్తి ఉన్న వారికి మార్గనిర్దేశం..

సివిల్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు మార్గనిర్దేశం, మెటీరియల్‌ను అందించడమే కాకుండా వారికి సలహా, సూచనలు అందిస్తానన్నారు. దీనికి కలెక్టర్ మెయిల్ ఐడీని విద్యార్థులకు ఇచ్చారు. స్కూల్, జూనియర్ కళాశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల భోజనంపై ఆరా..

మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా..? అని ఆరా తీశారు. కీసర తహసీల్దార్ అశోక్, ప్రిన్సిపాల్ రాజమణి, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపల్లి రెసిడెన్షియల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి